విజ్ఞాన మార్గం.. ఎంవీపీ గ్రంథాలయం



గ్రంథాలయంలో చదువుకుంటున్న యువత



ఎంవీపీ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు

- అందుబాటులో వేల చారిత్రక పుస్తకాలు
- సెలవుల్లో వినియోగించుకుంటే విజ్ఞానం సొంతం

ఎంవీపీ కాలనీ: యువతకు ఎంవీపీ కాలనీ గ్రంథాలయం విజ్ఞాన మార్గాన్ని చూపుతోంది. ఆరోగ్యం, ఆధ్యాత్మికం, విజ్ఞానం, చారిత్రక విషయ పరిజ్ఞానం ఇలా అన్ని రకాల పుస్తకాలను అందిస్తోంది. వేసవి సెలవుల నేపథ్యంలో ఈ గ్రంథాలయ సేవలు వినియోగించుకోవడం ద్వారా అటు సబ్జెక్టుల్లోనూ.. ఇటు సాంఘిక సామాజిక అంశాల్లో యువత పట్టు సాధించే అవకాశం ఉందని గ్రంథాలయ అధికారులు సూచిస్తున్నారు.

ఇదీ ప్రస్థానం

ఎంవీపీ కాలనీలో గ్రంథాలయ సేవలు 1969లో ప్రారంభమయ్యాయి. తొలుత పూర్ణమార్కెట్ దరి రంగిరీజు వీధిలో ఉన్న ఓ గ్రంథాలయాన్ని పూర్తిస్థాయిలో ఎంవీపీ కాలనీకి తరలించారు. దీంతో ఆనాటి నుంచి(1969) కాలనీలో గ్రంథాలయ సేవలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా ప్రధాన గ్రంథాలయం పరిధిలో ఈ గ్రంథాలయం దశాబ్దాలుగా విశిష్టమైన సేవలు అందిస్తోంది. రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ గ్రంథాలయం అందుబాటులో ఉంటుంది. ప్రతి శుక్రవారం గ్రంథాలయానికి సెలవు. యువత పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు ఎక్కువగా అడుగుతున్న నేపథ్యంలో ఈ మేరకు గ్రంథాలయంలో ఆయా పుస్తకాలను అందుబాటులో ఉంచారు.

అందుబాటులో పుస్తక సంపద

సీనియర్ సిటిజన్స్, విద్యార్థులు, యువత అవసరాలకు అనుగుణంగా ఇక్కడ వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కథలు, ప్రసిద్ధ నవలలు, ఆధ్యాత్మిక పుస్తకాలు, దేశ, విదేశాల చారిత్రక అంశాలతో కూడిన పుస్తకాలు, ప్రముఖుల ఆటోబయోగ్రఫీలు, ప్రాచీన సంస్కృతిని ప్రతిబింబించే పుస్తకాలు, సామాజిక, చైతన్య పరిచే పుస్తకాలు, శాస్త్ర సాంకేతిక అంశాలతో కూడిన వైజ్ఞానిక పుస్తక సంపద ఈ గ్రంథాలయంలో అందుబాటులో ఉంది. దీంతో పాటు ఇంగ్లిష్, గ్రామర్, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, యోగా, ఆయుర్వేదం పుస్తకాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

యువత వినియోగించుకోవాలి



విద్యార్థులకు, యువతకు కావాల్సిన అన్ని రకాల పుస్తక విజ్ఞానం ఇక్కడ అందుబాటులో ఉంది. వేసవి సెలవులకు ఈ గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు కావాల్సిన పుస్తకాలను ఎప్పటికప్పుడు తెప్పిస్తున్నాం. ఇటీవల విద్యార్థుల విజ్ఞప్తి మేరకు 102 పుస్తకాలను తెప్పించాం. ఏటా మాదిరిగా చిన్నారుల చైతన్యం కోసం ఈ వేసవిలో కూడా ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించనున్నాం.

– ఉమామహేశ్వరరావు, లైబ్రేరియన్, ఎంవీపీ కాలనీ గ్రంథాలయం

ముస్లింలకు అండగా వైఎస్సార్ కుటుంబం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, అక్కరమాని విజయనిర్మల

- ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ
- ఘనంగా ఇఫ్తార్ విందు

బీచ్ రోడ్డు: ముస్లింలకు అండగా ఉన్నది వైఎస్సార్ కుటుంబం ఒక్కటేనని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఆధ్వర్యంలో వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీ మాట్లాడుతూ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత దివంగత సీఎం వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. అదే విధంగా ముస్లింకు నాలుగు ఎమ్మెల్సీలు, నాలుగు ఎమ్మెల్యేల పదవులు ఇచ్చి చట్ట సభల్లో స్థానం కల్పించిన ఘనత ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్ద ఫరూక్, అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు, కార్పొరేటర్లు మువ్వల లక్ష్మి, అప్పారి శ్రీవిద్య, కెల్లా సునీత, పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, వార్డు ఇన్‌చార్జిలు జగ్గపల్లి అప్పలరాజు, ధనలక్ష్మి శంకర్, పల్లా దుర్గారావు, తారా మసీదు పెద్దలు అబ్దుల్ రజిక్, మదీనా, ఎండీ బాషా, ఎండీ మక్బుల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన

ఎంవీపీ కాలనీ: హిందూ ధర్మ ప్రచార పరిషత్(డీపీపీ), టీటీడీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంవీపీ కాలనీలోని కార్యాలయంలో భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం పలువురు మహిళలు ఆలపించిన అన్నమయ్య కీర్తనలు అలరించాయి. ఈ సందర్భంగా డీపీపీ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి నెలా 3వ శుక్రవారం ఈ సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. డీపీపీ సూపరింటెండెంట్ ఎస్‌కే చంద్రమౌళీశ్వరశర్మ, టీటీడీ సూపరింటెండెంట్ హేమావతి, సత్యకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ అందజేస్తున్న కార్పొరేటర్ రోహిణి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు సంతపాలెంలో నేషనల్ ఫార్మసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ప్రారంభించారు. పాదచారులు, స్థానికులకు మజ్జిగ, మంచినీరు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఫార్మసీ నిర్వాహకులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, ఈగల బుజ్జి, సూర్యారావు, హుస్సేన్ పాల్గొన్నారు.

15వ వార్డు అభివృద్ధికి రూ.50 లక్షల మంజూరు



మద్దిలపాలెం: జీవీఎంసీ స్థాయీ సంఘం సమావేశంలో 15వ వార్డుకు రూ.50 లక్షలు మంజూరైనట్టు కృషి చేశానని స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య తెలిపారు. ఈ నిధులతో వార్డు పరిధిలో అంబేడ్కర్‌నగర్, ఏపీఎస్ఈబీ కాలనీ, సీతమ్మధార ప్రాంతాలలో తారు రోడ్లు నిర్మాణం చేపట్టనున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన మేయర్ హరివెంకటకుమారికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

వ్యర్థాల శుద్ధి కేంద్రం నుంచి దుర్వాసనపై నిరసన



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

ఎంవీపీ కాలనీ: స్థానిక అప్పుఘర్ సమీప వ్యర్థాల శుద్ధి కేంద్రం నుంచి వస్తున్న దుర్వాసన భరించలేకపోతున్నామంటూ స్థానికులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇటీవల కొంతకాలంగా ఇక్కడ వ్యర్థాల నిల్వలు పెరిగాయని స్థానికులు ఆరోపించారు. దీంతో పాటు వ్యర్థాల లోడుతో ఉన్న వాహనాలను ఎక్కువ సమయం నిలిపివేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతుందని ఆరోపించారు. స్థానికుల నిరసనతో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి అక్కడికి చేరుకుని మాట్లాడారు. స్థానికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మీనాక్షీ కల్యాణం నృత్య రూపకం రేపు



సౌజన్య శ్రీనివాస్

బీచ్ రోడ్డు: వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో సౌజన్య శ్రీనివాస్ ప్రధాన పాత్ర పోషిస్తున్న మీనాక్షీ కల్యాణం నృత్య రూపకాన్ని ఆదివారం ప్రదర్శించనున్నారు. ఈ ప్రదర్శనకు పసుమర్తి రామలింగశాస్త్రి దర్శకత్వం వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభం కానున్న ఈ ప్రదర్శనను విజయవంతం చేయాలని నిర్వాహకులు తెలిపారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శుల సమావేశం

ఎంవీపీ కాలనీ: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు, కన్వీనర్ల సమావేశం శుక్రవారం లాసన్స్‌బే కాలనీలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగింది. పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఇటీవల ప్రారంభించిన మోదీ సర్కార్ పేరుతో గోడ రాతలు కార్యక్రమంపై కన్వీనర్లకు పలు సూచనలు చేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు స్వచ్ఛమైన కుళాయి నీరు సరఫరా



ముస్తఫా కాలనీలో శుక్రవారం సరఫరా చేసిన కుళాయి నీరు



బాలాజీనగర్‌లో సరఫరా అయిన కుళాయి నీరు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: ఆరిలోవలో శుక్రవారం ఎట్టకేలకు స్వచ్ఛమైన కుళాయి నీరు సరఫరా అయింది. ఆరిలోవలో పలు ప్రాంతాల్లో రంగు మారిన, నలతలతో కూడిన నీరు సరఫరా కావడంతో సాక్షి దినపత్రికలో 'ఈ నీటిని తాగలేం.!' శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన వార్తకు నీటి సరఫరా అధికారులు స్పందించారు. టీవీసీ పాయింట్, అంబేడ్కర్‌నగర్, ముస్తఫా కాలనీ, డ్రైవర్స్ కాలనీ, బాలాజీనగర్ ప్రాంతాలను పరిశీలించారు. పైపులైన్లలో ఏర్పడిన చిన్నపాటి సమస్యలను సరిచేశారు. అనంతరం స్వచ్ఛమైన మంచినీటిని కుళాయిల ద్వారా సరఫరా చేశారు. ఆయా ప్రాంతాల్లో ముడసర్లోవ నీటి సరఫరా విభాగం ఏఈ అప్పాజీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, సిబ్బంది వెళ్లి శుక్రవారం సరఫరా జరిగిన నీటిని పరిశీలించారు. స్వచ్ఛమైన నీరు సరఫరా కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నీటి సరఫరా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏఈ అప్పాజీ మాట్లాడుతూ ముడసర్లోవ పార్కులో నీటి గేలరీ ఇటీవల బాగు చేశామన్నారు. దీంతో పాటు కొన్నిచోట్ల కాలనీల్లో ఇళ్ల ముందు నీటి పైపులు కదిలిపోవడం, కొన్నిచోట్ల లీకులు ఏర్పడ్డాయన్నారు. వాటిని శుక్రవారం బాగు చేసి, స్వచ్ఛమైన నీటిని సరఫరా చేశామన్నారు. నీటి సరఫరాలో ఎలాంటి సమస్య వచ్చినా స్థానికులు వెంటనే తెలియజేయాలని కోరారు.

'మద్దిలపాలెం డిపోలో సమస్యలు పరిష్కరించాలి'



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

మద్దిలపాలెం: ఆర్టీసీ మద్దిలపాలెం డిపోలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అర్బన్ తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ డిపో కన్వీనర్ కె.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ మద్దిలపాలెం డిపోలో రద్దు చేసిన పలు ప్రాంతాల సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసినా ప్రశాంతంగా విధులు నిర్వహించకుండా యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పి.వి.వి.మోహన్, జోనల్ సెక్రటరీ ఎం.వి.ఆర్.మూర్తి, కె.వి.రమణ, సిహెచ్.ఈ.రావు పాల్గొన్నారు.

సాయి మందిరంలో ఘనంగా ఇఫ్తార్ విందు




ఇఫ్తార్ సందర్భంగా ముస్లిమ్ పెద్దలను సత్కరిస్తున్న సాయి మందిరం ప్రతినిధులు

అగనంపూడి: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా అగనంపూడి సాయిబాబా ఆలయంలో శుక్రవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మసీద్ ఈ అబూబర్ అధ్యక్షుడు మీరా మొహిద్దీన్ మాట్లాడుతూ మతాల ప్రమేయం లేకుండా హిందూ, ముస్లింలు సఖ్యతతో సోదర భావంతో మెలుగుతూ దేశ సమగ్రతను కాపాడుకుంటున్నామన్నారు. సాయి మందిర కమిటీ ప్రతీ ఏటా ఇఫ్తార్ విందు ఏర్పాటు సంప్రదాయంగా కొనసాగడం సంతోషంగా ఉందన్నారు.

అనంతరం మీరా మొహిద్దీన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కె.వి.రమణారెడ్డి, నాయకులు బి.సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు డి.వ్యాసశర్మ, జి.శంభుడు, పి.సత్యనారాయణ, సత్యవతి, లీలావతి, పంకజం తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ ఉద్యోగి త్రిమూర్తులు మృతికి సంతాపం



జంగా త్రిమూర్తులు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఆచార్యులు, ఉద్యోగులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగి జంగా త్రిమూర్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై ఏయూ ఆచార్యులు, ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు. ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం సాయంత్రం సంతాప సభ ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, ఆచార్య కె.వెంకటరావు, ఆచార్య జాలాది రవి, ఉద్యోగులు ఇసుకపల్లి వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, పరిశోధకులు డాక్టర్ బి.మోహన్‌బాబు, డాక్టర్ కల్యాణ్, డాక్టర్ శాంతారావు, డాక్టర్ రాజ్‌కుమార్, వెంకట్, జాబ్లీ, ఎ.ప్రసాద్ పాల్గొన్నారు.

పదేళ్లు దాటితే ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

మహారాణిపేట: ఆధార్ కార్డు తీసుకుని పదేళ్లు దాటితే కచ్చితంగా అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాస మూర్తి అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ రెండో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్రస్ ప్రూఫ్, ఐడెంటిటీ ప్రూఫ్‌తో దగ్గరలోని ఆధార్ కేంద్రం, మండల ప్రధాన కేంద్రంలోని సచివాలయం, బ్యాంకులు, పోస్ట్ ఆఫీస్, వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో గాని అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు. జూన్ నెల 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఆధార్ అప్‌డేట్ ఉచితమని పేర్కొన్నారు. అడ్రెస్ ప్రూఫ్ లేనట్లయితే వారి సచివాలయంలో 20/– చెల్లించి సర్టిఫికెట్ పొందవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో డీఎల్‌డీవో పూర్ణిమా దేవి, జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, యూఐడీఏఐ రీజినల్ మేనేజర్ గిరిధర్, వైద్య ఆరోగ్య శాఖ, బ్యాంకింగ్, పోస్టల్, ఎడ్యుకేషన్, బీఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్, గన్నవరం–ముస్తాబాద–గుణదల సెక్షన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం ఆ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. కింద పేర్కొన్న రైళ్లు ఆయా తేదీల్లో రెగ్యులర్ మార్గం నిడదవోలు–ఏలూరు–విజయవాడల మీదుగా కాకుండా వయా నిడదవోలు–భీమవరం టౌన్–గుడివాడ–విజయవాడల మీదుగా నడుస్తాయి.

- ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖలో బయలుదేరే విశాఖపట్నం–గుంటూరు(17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్..
- ఈ నెల 21న ధన్‌బాద్‌లో బయలుదేరిన ధన్‌బాద్–అలెప్పి(13351) బొకారో ఎక్స్‌ప్రెస్..
- ఈ నెల 21న టాటానగర్‌లో బయలుదేరే టాటానగర్–బెంగళూరు(12889) ఎక్స్‌ప్రెస్..
- ఈ నెల 22న హతియాలో బయలుదేరే హతియా–బెంగళూరు(18637) ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించిన మార్గంలో నడుస్తాయి.

విలువలతో కూడిన విద్య అవసరం

మద్దిలపాలెం: విలువలతో కూడిన విద్య అవసరమని డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, ఏయూ ఎన్ఎస్ఎస్ అధికారి హరినాథ్ అన్నారు. కృష్ణా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 3, 4 విభాగాలతో ఏయూలో ప్రత్యేక సేవా శిబిరాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛభారత్, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు చేపట్టే కార్యక్రమాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ 3, 4 ఎన్ఎస్ఎస్ అధికారులు వి.సుధీర్, పోలా ఉమామహేశ్వరరావు, 1, 2 యూనిట్ అధికారులు వి.రత్నభారతి, సామ్యూల్ డేవిడ్ రాజులు, అధ్యాపకుడు సిహెచ్.విష్ణుమూర్తి పాల్గొన్నారు.


పోలీసుల అదుపులో ఈవ్‌టీజర్

ఆరిలోవ: ఓ యువతిపై ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతూ సీపీ కంట పడిన యువకుడ్ని ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ శుక్రవారం ఉదయం రుషికొండ వైపు బీచ్ రోడ్డులో పోలీసు వాహనంలో వెళ్తున్నారు. ఆదే సమయంలో జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్ మధ్యలో ఓ యువతిని యువకుడు ఈవ్ టీజింగ్ చేస్తుండగా సీపీ గమనించారు. వారి దగ్గరకు వెళ్లేసరికి ఆ యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్లిపోయాడు. ఆ వాహనం నంబరు గుర్తుపెట్టుకున్న సీపీ అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు పీఎం పాలెం వద్ద ఆ నంబరు గల వాహనాన్ని పట్టుకొని ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో సంఘటన జరగడంతో ఆ యువకుడిని పీఎం పాలెం పోలీసులు ఆరిలోవ పోలీసులకు అప్పగించారు. ఇదిలా ఉండగా ఈవ్ టీజింగ్‌కు గురైన యువతి నుంచి పోలీసులుకు ఫిర్యాదు అందలేదు. ప్రస్తుతం ఆ యువకుడు అదుపులో ఉన్నట్లు ఆరిలోవ సీఐ సోమశేఖర్ తెలిపారు.

వైఎస్సార్ బీమా పరిహారం అందజేత

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లో మృతి చెందిన ఓ మహిళ కుటుంబానికి వైఎస్సార్ బీమా వర్తించింది. ఈ మేరకు బాధిత కుటుంబానికి శుక్రవారం సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు తక్షణ పరిహారం అందజేశారు. ఇందిరానగర్‌కు చెందిన అల్లూరి రాజేశ్వరి(43) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. ఆమె కుటుంబానికి శుక్రవారం తక్షణ సహాయం కింద రూ.10 వేలు నగదును వైఎస్సార్‌సీపీ నాయకులు జగ్గపిల్లి అప్పలరాజు, కంటుబోతు తులసీ సమక్షంలో అందజేశారు. మిగతా నగదు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని సచివాలయ సిబ్బంది తెలిపారు.

కృష్ణా కాలేజీ డిగ్రీ విద్యార్థులు జూ సందర్శన



జూ ద్వారం వద్ద కృష్ణా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

ఆరిలోవ: డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలలో బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతున్న బోటనీ విద్యార్థులు విభాగం అధ్యాపకులతో కలిసి శుక్రవారం జూ పార్కును సందర్శించారు. బయాలజీ ఫీల్డ్ విజిట్‌లో భాగంగా జూలో వన్య ప్రాణులు, చెట్లు, మొక్కలను పరిశీలించారు. జువాలజీ హెచ్‌వోడీ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, జువాలజీ అధ్యాపకురాలు డాక్టర్ పి.ఆర్.వాణి, బోటనీ అధ్యాపకుడు డాక్టర్ డి.ఎస్.మాధవరావు విద్యార్థులకు జంతువులు, పక్షులు, మొక్కలపై అవగాహన కల్పించారు. సీతాకోక చిలుకలు పార్కును కూడా సందర్శించారు. అనంతరం జూ పార్కు ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన వరల్డ్ ఎర్త్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. భూమండలం సంరక్షణ గురించి అవగాహన కల్పించారు.

విద్యా సమాచారమ్

స్వచ్ఛ క్యాంపస్‌లో సైనికోద్యోగులు



శ్రమదానంలో పాల్గొన్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛక్యాంపస్ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వర్సిటీలో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న సైనికోద్యోగులు భాగస్వాములయ్యారు. స్వయంగా శ్రమదానం చేసి వర్సిటీలో పలు ప్రాంతాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సైనికోద్యోగులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అభినందిచారు. వర్సిటీని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో సైనికోద్యోగులు భాగం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, శానిటేషన్–బ్యూటిఫికేషన్ విభాగం డీన్ డాక్టర్ ఉజ్వల్ కుమార్ ఘటక్, కల్నల్ మణికుమార్, ఎం.వి.ఎస్.రాజు, సత్వీర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహించనున్న 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ రేషనల్ డ్రగ్ డిస్కవరీ' జాతీయ సదస్సు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్ పదవీ విరమణ పురస్కరించుకుని ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆచార్య జి.గిరిజా శంకర్, వి.గిరిజా శాస్త్రి, కె.ఈశ్వర్‌కుమార్, ఎం.మురళీకృష్ణ కుమార్ పాల్గొన్నారు.